క్లుప్తంగా

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి తిలకించేందుకు ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కరపా మండలం ఉప్పలంకకు చెందిన కర్రి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో వచ్చారు. అయితే, రద్దీ కారణంగా శ్రీనివాస్ నాలుగేళ్ల కుమారుడు వెన్షిక్ అయాన్ తప్పిపోయాడు. దీంతో పోలీసులు బాలుడిని చేరదీసి చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించగా.. ఆరా తీయడంతో బాలుడు తన తల్లిదండ్రుల పేర్లు చెప్పాడు. ఈ మేరకు మైక్ ద్వారా అనౌన్స్ చేయించడంతో తల్లిదండ్రులు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకోగా బాలుడిని అప్పగించారు.

అస్వస్థతకు గురైన భక్తులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని వీక్షిస్తున్న పలువురు భక్తులు ఎండ తీవ్రత, ఉక్కపోత తట్టుకోలేక అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని సమీపంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారికి చికిత్స చేశాక పంపించారు.

ఆలయ సేవకురాలికి సన్మానం

ములకలపల్లి: ములకలపల్లి భక్త అభయాంజనేయస్వామి ఆలయంలో సేవలందిస్తున్న కేతేపల్లి నాగరత్నాన్ని ఘనంగా సన్మానించారు. ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. నాగరత్నం గత 30 ఏళ్లుగా ఆలయంలో నిస్వార్థంగా సేవలందించడం అభినందనీయమన్నారు. పట్టు వస్త్రాలు బహూకరించి, స్థానికంగా సమీకరించిన ఆర్థికసాయాన్ని ఆమెకు అందజేశారు. మున్నూరుకాపు మండల మహిళా సఘం ఆధ్వర్యంలో నగదును వివరణగా అందజేశారు. భక్తాంజనేయ, ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయాల కమిటీ అధ్యక్షుడు శనగపాటి రవి, నరాటి ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ఎంపీటీసీ మెహరమణి, మాజీ ఉపసర్పంచ్ శనగపాటి అంజి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయిరాంపురంలో తాగునీటి ఎద్దడి

ములకలపల్లి: మండలపరిధిలోని సాయిరాంపురం గ్రామస్తులు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి తాగునీరందించే డైరెక్ట్ పంపింగ్ స్కీం (డీపీ) మోటారు కాలిపోయింది. దీంతో వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయినా మరమ్మతులపట్ల దృష్టి సారించడంలేదని వాపోతున్నారు. సమస్యను సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా.. అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో గ్రామశివార్లలోని వ్యవసాయ మోటార్లు, చేతిపంపుల నుండి నీటిని తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటుటున్నట్లు తెలిపారు. వేసవితో దాహార్తి తీర్చుకునేందుకు నానాతంటాలు పడుతున్నాయని, వెంటనే తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని ముక్త కంఠంతో కోరుతున్నారు. జీఎస్ఎస్ రాష్ట్ర యువనాయకులు ఆరెం ప్రశాంత్, వాడె వీర స్వామి గ్రామాన్ని సందర్శించి, గ్రామస్తులతో మాట్లాడారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విజయవంతం చేయండి

మణుగూరుటౌన్: ఈ నెల 21న గోదావరి ఖనిలో జరిగే ఐఎన్టీయూసీ మహాసభలకు మణుగూరు ఏరియా నుంచి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ మణుగూరు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు పిలుపునిచ్చారు. బుధవారం పీవీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ ముందుంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, నాయకులు రాయలింగు, మస్తాన్, షాబుద్దీన్, జయరాజు, శ్రీనివాస్, సంతోష్‌చరణ్, చేతన్, పెద్ద నాగయ్య, రాము, రామకృష్ణ, వర్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సుధాకర్, అంథోటి మార్కు తదితరులు ఉన్నారు.

తాటి ముంజలకు గిరాకీ!

అశ్వారావుపేటరూరల్: వేసవి కాలంలో మాత్రమే లభించే తాటి ముంజలకు వినియోగదారుల నుంచి డిమాండ్ పెరిగింది. తాటి ముంజుల్లో ఏలాంటి రసాయనాలు లేకపోవడంతో అధిక సంఖ్యలో వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. దాంతో వీటిని విక్రయాలకు పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడు పోతున్నాయి. అశ్వారావుపేటలోని రింగ్ రోడ్, పోలీస్ స్టేషన్ సెంటర్లతోపాటు మేజర్ గ్రామ పంచాయతీ మార్గంలో వీటిని విక్రయిస్తున్నారు. తాటి ముంజలు డజన్ రూ.50కే విక్రయిస్తుండటంతో వినియోగదారులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన భద్రగిరి

- ఏపీ నుంచే అధికంగా భక్తుల రాక
- రూ.10కే పట్టణంలో మినీ బస్సుల్లో ప్రయాణం
- ప్రత్యేక బస్సులతో తప్పిన తిప్పలు



కళాశాల మైదానంలో నిలిపి ఉంచిన ఏపీ బస్సులు



తలంబ్రాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



భక్తుల కోసం నడిపించిన మినీ బస్సులు

భద్రాచలంటౌన్: జగదభి రాముడి కల్యాణాన్ని కన్నులారా వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచి హాజరైన భద్రగిరి కిక్కిరిసిపోయింది. మంగళవారం సాయంత్రానికే ఎక్కువ మంది భక్తులు భద్రాచలం చేరుకోగా.. బుధవారం ఉదయం గోదావరికి పవిత్రస్నానాలకు రావడంతో గోదావరి తీరం భక్తజన సంద్రంగా మారింది. అనంతరం భక్తులు మిథిలా స్టేడియానికి చేరుకుని శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించారు.

ఆంధ్రా నుంచే అధికం..

భద్రాద్రి రామయ్య కల్యాణం తిలకించేందుకు తెలంగాణ కంటే ఏపీ నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఏపీఎస్ ఆర్టీసీ అక్కడి వివిధ ప్రాంతాల నుంచి ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లను నడిపించింది. భక్తులను భద్రాచలం తీసుకొచ్చి తిరిగి గమ్యాలకు చేర్చే వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇక ఏపీ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాదయాత్ర ద్వారా భద్రాచలం చేరుకోవడం, కొందరు రెండు, మూడు రోజులు చెప్పులు లేకుండా కాలినడకన రావడంతో ఎండ తీవ్రతకు బొబ్బలు వచ్చాయి.

ఆర్టీసీ ఆఫర్..

ఆర్టీసీ అధికారులు భక్తుల కోసం ఈసారి ప్రత్యేక ఆఫర్ అమలు చేశారు. భద్రాచలంలోని బస్టాండ్‌ను తెలంగాణ బస్సులకే కేటాయించి ఏపీ నుంచి వచ్చిన బస్సుల కోసం జూనియర్ కళాశాల మైదానంలో ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేశారు. తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఈ ఏర్పాటు చేయడం మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఇక జూనియర్ కళాశాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు మిథిలా స్టేడియంకు మినీ బస్సులు నడిపారు. ఇందులో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించగా.. పురుషుల నుంచి రూ.10 మాత్రమే వసూలు చేయడంతో మంచి ఆదరణ లభించింది. కాగా, ఎక్కువ మంది భక్తులు ఈసారి ఆర్టీసీ బస్సుల్లో కాకుండా సొంత బస్సుల్లో రావడానికే మొగ్గు చూపారు. ఎండ తీవ్రత కారణంగా ప్రైవేట్, సొంత కార్లలో రావడంతో పార్కింగ్ స్థలాలు, ప్రధాన రహదారులు కార్లతో నిండిపోయాయి. ఈక్రమంలో భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో తాకిడి తగ్గింది.

మండుటెండలో అవస్థలు

రామయ కల్యాణం తిలకించేందుకు ఒకరోజు ముందుగానే భద్రాద్రి చేరుకున్న భక్తులు కల్యాణం అనంతరం తిరుగు ప్రయాణంలో మండుటెండ కారణంగా ఇబ్బంది పడ్డారు. కల్యాణం ముగిసేసరికి మధ్యాహ్నం ఒంటి గంట కావడంతో భక్తులు బస్సులు ఎక్కేందుకు ఎటు వెళ్లాలో తెలియక సతమతమయ్యారు. భక్తులకు అవగాహన కల్పించేలా రూట్ మ్యాప్‌లు చాలా ప్రాంతాల్లో లేకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. ఇక కల్యాణం ముగిశాక భక్తులంతా ఒకేసారి ప్రధాన రహదారిపైకి చేరుకోవడంతో స్వల్పంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎప్పటిలాగే పోలీసులు తలంబ్రాలు సేకరించేందుకు కల్యాణ వేదిక వద్దకు వెళ్లిపోగా అటు భక్తులు, ఇటు వాహనాలను నియంత్రించే వారు కరువయ్యారు. కానీ గతంతో పోలిస్తే ట్రాఫిక్ ఇక్కట్లు పెద్దగా ఎదురుకాలేదనే చెప్పాలి.

40 ఏళ్లుగా వస్తున్నా...



సీతారామచంద్ర స్వామివారి కల్యాణం చూసేందుకు 40 ఏళ్లుగా వస్తున్నా. ప్రతీసారి కంటే ఈసారి దగ్గర నుంచి కల్యాణం తిలకించడం సంతోషంగా ఉంది. ఇన్ని సార్లు రామయ్య కల్యాణం క్రమం తప్పకుండా చూడడానికి వస్తుండడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– నర్సింహులు, నిజామాబాద్

సత్రాల్లో గదులు దొరకలేదు..



దేవస్థానం సత్రాలు మొత్తం ఆన్‌లైన్ చేశారని మాకు గదులు ఇవ్వలేదు. దీంతో రాత్రంతా ఆలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. సామాన్య భక్తుల కోసం కొన్ని సత్రాలు కేటాయిస్తే బాగుండేది. వీఐపీలతో పాటు సామాన్య భక్తులను సైతం అధికారులు గుర్తించాలని కోరుతున్నా.

– రమణ, కాకినాడ

తలంబ్రాలు అందాయి..



ఏటా రామయ్య కల్యాణ తలంబ్రాల కోసం తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చేది. కొన్ని సార్లు తలంబ్రాలు తీసుకోకుండానే వెళ్లిపోయా. కానీ ఈ ఏడాది మంచిగా అందాయి. ఎక్కువ కౌంటర్లు ఏర్పాట్లు చేయడంతో జనాల తాకిడి లేదు. ఇందుకు అధికారులకు ధన్యావాదాలు.

– మంగ, గుడివాడ

భోజనం కోసం ఇబ్బంది పడ్డాం



శ్రీరామనవమి కోసం రెండు రోజుల క్రితం వచ్చాం. అధికారులు కల్యాణానికి ఏర్పాటు బాగాచేశారు. కానీ అన్నదాన సత్రం వద్ద భోజనాల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది. స్థోమత ఉన్నవారు హోటళ్లకు వెళ్లినా.. సామాన్యుల విషయంలో అధికారులు ఆలోచించాలి.

– రవి, కాకినాడ

ఏర్పాట్లు బాగున్నాయి..



రామయ్య కల్యాణానికి ఐదేళ్ల నుంచి వస్తున్నా. భక్తుల కోసం అధికారులు ఏర్పాట్లు బాగా చేశారు. ఈ ఏడాది కల్యాణం మంచిగా చూశానని అనిపించింది. ఒకరోజు ముందుగానే రావడంతో ఆలయంలో రామయ్యను కుటుంబ సమేతంగా దర్శించుకుని కల్యాణం తిలకించాం.

– సుబ్రహ్మణ్యం, విజయనగరం

నయనానందంగా రాములోరి పెళ్లి..

పర్ణశాలకు భారీగా హాజరైన భక్తులు



స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల పుణ్యక్షేత్రంలో సీతారాముల కల్యాణం బుధవారం అత్యంత వైభవంగా సాగింది. అర్చకులు ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించాక ఉత్సవ మూర్తులను అలంకరించి మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, భరద్వాజచార్యులు, పొడిచేటి సీతారామాచార్యులు, నరసింహాచార్యులు ఆధ్వర్యాన కల్యాణ క్రతువు నిర్వహించారు. వేదపండితులు మధ్యాహ్నం 12గంటలకు అభిజిత్ లగ్నంలో సీతారాములకు జీలకర, బెల్లం పెట్టాక మాంగల్యధారణ జరిపించి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవానికి భారీగా భక్తులు హాజరుకాగా.. ఆలయ ఆవరణ శ్రీరామనామంతో మార్మోగింది. ఆ తర్వాత కల్యాణమూర్తులను ప్రధాన ఆలయం వరకు భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ మేరకు భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా వివిధ శాఖల ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. దుమ్ముగూడెం సీఐ అశోక్ పర్యవేక్షణలో ఎస్సైలు కేశవ్ రావు, గణేష్ భారీ బందోబస్తు నిర్వహించగా, తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ ముత్యాలరావు, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, దేవస్థానం ఏఈఓ శ్రావణ్‌కుమార్, ఉత్సవాల ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, పర్ణశాల వచ్చే భక్తులకు నర్సాపురం, సీతారాంపురం, ములకపాడు, బండిరేవు, పెద్దనల్లబల్లి గ్రామాల్లో ప్రజలు పానకం, ప్రసాదం పంపిణీ చేశారు.

ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు

పర్ణశాలలో సీతారాముల కల్యాణం నిర్వహించిన మండపం ఆవరణలో షామియానా వేశారు. భక్తులకు భానుడి ప్రతాపం నుంచి ఇబ్బంది కావొద్దని ఈ ఏర్పాట్లు చేసినా ఎండ తీవ్రంగా ఉండడంతో భక్తులు అవస్థ పడ్డారు. షామియానాల కింద ఫ్యాన్లు ఏర్పాటుచేసినా గాలి సరిపోక చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పర్ణశాలలో జేబు దొంగలు తమ చేతులకు పని చెప్పారు. పోలీసులు ఎంత నిఘా పెట్టినా పలువురు భక్తులు ఫోన్లు చోరీకి గురయ్యాయి.



సీతమ్మవారి తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



కల్యాణం అనంతరం ఊరేగింపులో శ్రీ సీతారామ చంద్రస్వామి..

సమస్యల పరిష్కారానికి వినతి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఈపీ ఆపరేటర్ల నాయకుడు నాజర్‌పాషా

మణుగూరుటౌన్: సింగరేణి వ్యాప్తంగా ఓసీ గనుల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ.. మణుగూరు ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో కొత్తగూడెం హెడ్‌ఆఫీస్‌లో డైరెక్టర్ (పా) ఎస్‌వీకే శ్రీనివాస్, జీఎం పర్సనల్ హనుమంతరావుకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్ల నాయకులు నాసర్‌పాషా మాట్లాడుతూ.. ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్‌కు సంబంధించి గత రెండున్నరేళ్ల క్రితం యాజమాన్యానికి ఆరు కార్మిక సంఘాలకు కుదిరిన ఒప్పందం నేటికీ అమలు కాలేదన్నారు. అనారోగ్య కారణంగా ఆపరేటర్లు భారీ యంత్రాలు నడపడానికి అర్హులు కాని వారికి డిసిగ్నేషన్ మారకుండా న్యాయం చేయాలన్నారు. కమిటీ వేయని కారణంగా అనేకమంది ఆపరేటర్లు డిప్రమోట్ జనరల్ మజ్దూర్లుగా పనిచేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి ఉత్పాదకతల్లో ప్రధాన భూమిక పోషించే ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా కొత్తగూడెం రీజియన్ స్థాయిలో బీ–గ్రేడ్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన ఆపరేటర్లకు బ్యాడ్‌డేట్‌తో న్యాయం, రెండేళ్లు పూర్తి చేసిన సీగ్రేడ్ ఆపరేటర్లకు గ్రేడ్ టెస్ట్, రేడియల్ టైర్ల కొనుగోలు, లక్ష్యాలు సాధించిన కార్మికులకు స్వీట్‌ప్యాకెట్, జ్ఞాపిక తదితర సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్



బూర్గంపాడు: సారపాకలో పానకం అందిస్తున్న గ్రామీణ వైద్యులు



భద్రాచలంటౌన్: మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు



అశ్వాపురం: మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న దోసపాటి పిచ్చేశ్వరరావు



భద్రాచలంటౌన్: అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ..

భద్రాచలంటౌన్: భద్రాద్రిలో సీతారామచంద్ర స్వామివారి కల్యాణానికి వచ్చిన భక్తులకు మంగళవారం పలు కుల, స్వచ్ఛంద సంస్థలతో పాటు విద్యాసంస్థల వారు తమదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాపు, క్షత్రీయ, కమ్మ, రెడ్డి కుల సంఘాలు, వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్ వారు మజ్జిగా, పానకం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రధాన కూడళ్లలో వ్యాపారులు, వివిధ కార్మిక సంఘాలు, అబ్దుల్ కలామ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగా, తాగునీరు, బెల్లం పానకం అందజేశారు.

దోసపాటి రంగారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణానికి వచ్చే భక్తులకు ఎండ తీవ్రతకు గురి కాకుండా భక్తుల సౌకర్యార్థం శివకామేశ్వరి గ్రూప్స్(ఎస్‌కేటీ) ఆధ్వర్యంలో బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్, శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు 15 వేల మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకామేశ్వరి గ్రూప్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం..

మణుగూరురూరల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సమితిసింగారం గ్రామంలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు మండం మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బెల్లం పానకాన్ని పంపిణీ చేశారు. అలాగే పీవీకాలనీలోని రామాలయం ఆవరణలో మున్నూరుకాపు సింగరేణి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సుమారు 2వేల మందికి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్, కార్యదర్శి గాండ్ల సురేష్, పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ వలసాల వెంకటరామారావు, మాదాసు సాయిబాబా, లక్ష్మీశెట్టి ప్రసాద్, ఏనుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐటీసీ పీఎస్‌పీడీ..

బూర్గంపాడు: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అడుగడుగునా స్థానికులు సేవలను అందించారు. ఐటీసీ పీఎస్‌పీడీ వారు భక్తులకు మజ్జిగ, తాగునీరు, పానకం, పులిహోర ప్యాకెట్లను అందించారు. మోరంపల్లిబంజర, బూర్గంపాడు, పాత గొమ్మూరు, నాగినేనిప్రోలు, సారపాకలలో గ్రామీణ వైద్యులు, పలు ఇతర స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజా సంఘాల వారు తాగునీరు,మజ్జిగ, పులిహోర, పానకం, అన్నప్రసాదాలను అందించారు.

క్షత్రియ సేవా సమితి..

అశ్వారావుపేటరూరల్: సీతారాముల కల్యాణ మహోత్సవానికి భద్రాచలం వెళ్లి తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్తున్న రామభక్తులకు వితరణ అందించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అశ్వారావుపేట క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సుల్లో స్వగ్రామాలకు వెళ్లే భక్తులందరికీ పులిహోర, బటర్ మిల్క్, వాటర్ ప్యాకెట్లు, బెల్లం పానకాన్ని పంపిణీ చేశారు. సేవా సమితి బాధ్యులు సోమరాజు మాట్లాడారు. అలాగే ఎండలను దృష్టిలో పెట్టుకొని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీలకు కూలింగ్ వాటర్ అందించేందుకు రూ.5వేలు వితరణ అందించినట్లు తెలిపారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం వాడవాడలా ఉత్సవాలు జరిగాయి. భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఆలయాల్లో అర్చకులు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిధ్యాల నడుమ కన్నుల పండువగా సీతారాముల కల్యాణం జరిపించారు. పానకం, వడ పప్పు తదితర తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం కల్యాణానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గుండాల: ఆళ్లపల్లిలో సీతారాముల కల్యాణం వీక్షిస్తున్న భక్తులు



మణుగూరురూరల్: సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాయం



దమ్మపేట: సుధాపల్లి రామాలయంలో మామిడి తోరణం కడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



మణుగూరుటౌన్: పీవీ కాలనీ రామాలయంలోని ఊరేగింపులో జీఎం దుర్గం రామచందర్



చండ్రుగొండ: పూజారి నుంచి తలంబ్రాలు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ వెంకటరెడ్డి



అన్నపురెడ్డిపల్లి: భక్తులకు మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు



చండ్రుగొండ: సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పూజారి వీవీఆర్‌కే మూర్తి



ములకలపల్లి: పొగళ్లపల్లి ఆలయంలో..



మణుగూరుటౌన్: ఊరేగింపు..



అశ్వారావుపేటరూరల్: వాసవీ ఆలయంలో..



గుండాలలో అన్నదాన కార్యక్రమం..



బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో..



అశ్వాపురం: మొండికుంటలో..